ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 8 డిసెంబరు 2025 | 5





కోటసత్తెమ్మ ఆలయంలో రెండు చేతుల పైకెత్తి మొక్కుకుంటున్న మహిళలు

కాపాడమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాపాడమ్మా కోటసత్తెమ్మ అంటూ మహిళలు మొక్కుకున్నారు.కోటసత్తెమ్మ తిరునాళ్లలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నూటొక్క మంది మహిళలు కలశాలతో అమ్మవారికి ఊరేగింపుగా చీర, సారె సమర్పించారు. అర్చకుడు అప్పారావు శర్మ అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, దేవస్థానం సహాయ కమిషనర్ హరి సూర్య ప్రకాష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హమ్మయ్య..ఇన్నాళ్లకు రోడ్డు పనులు!



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆ రోడ్డులో వెళ్లాలంటే నరకమే.. పడుతూ లేస్తూ వెళ్లాల్సిందే.. ఎందుకంటే అంత పెద్ద గోతులు మరి..అదే పెరవలి మండలంలోని కానూరు- ఉసులుమర్రు రోడ్డు.. అయితే ఆ రోడ్డు పనులకు మోక్షం కలిగింది. సుమారు 3 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రోడ్డు పనులను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఇలా ఎక్స్‌కవేటర్ ఎక్కి ప్రారంభించారు.గత ప్రభుత్వ హయాంలో పెనుగొండ నుంచి నిడదవోలు వరకు ఈ రహదారి వేసినప్పటికి నాణ్యత లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఈ ప్రాంత ప్రజలు సిమెంట్ రోడ్డు కావాలని అడగడంతో స్పందించిన మంత్రి ప్రభుత్వ అనుమతి పొందారు. పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టైమ్‌కి భోజనం పెట్టరా?

మధ్యాహ్నం 2:30 గంటలకు భోజనం - వార్డెన్‌పై ఎమ్మెల్యే వాసు ఆగ్రహం



హాస్టల్ వార్డెన్‌పై మండిపడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల వరకూ భోజనం ఎందుకు పెట్టలేదు ? ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. అధికారులు సక్రమంగా పనిచేయకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించేదిలేదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాజమహేంద్రవరంలోని ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1 లేడీవార్డెన్‌పై మండిపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో విద్యార్థులకు అన్నం పెడుతున్న విషయాన్ని గుర్తించారు. ప్రతి ఆదివారం భోజనం ఇలా లేట్ అవుతోందా ? సిబ్బంది ఎంతమంది ఉన్నారు అని ఆరా తీశారు. దీనిపై హాస్టల్ వార్డెన్ ప్రభావతి పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు పెట్టే మెనూ చార్టు లేకపోవడంపై వార్డెన్‌ను ప్రశ్నించారు. తక్షణమే మెనూ రాయించండి అని ఆదేశించారు. ఈ సమయంలో పలువురు విద్యార్థులు హాస్టల్ సిబ్బంది భోజనం వడ్డించడంలేదని, మెనూ అమలు చేయడంలేదని, నాన్ వెజ్, ఇతర కూరలు రుచీపచీలేకుండా ఉంటున్నాయని, సరిగా పెట్టడంలేదని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ దళిత నాయకులు ఎస్సీ హాస్టళ్లను తరచూ సందర్శించి.. సమస్యలు తెలుసుకోవాలని కాశి నవీన్‌కుమార్‌కు సూచించారు. తక్షణమే విద్యార్థులతో మెస్ కమిటీ ఏర్పాటు చేయాలని, మెనూ బోర్డు పెట్టాలని లేడీ వార్డెన్‌ను ఆదేశించారు.

పౌరసేవలపై శిక్షణ

రాజమహేంద్రవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 21 మండలాల పరిధిలో 512 సచివాలయాల ద్వారా 4067 మంది సిబ్బందితో 6,54,119 కుటుంబాలకు చెందిన 18,32,965 మంది ప్రజలకు అందిస్తున్న సేవలను ఇక మండలాల వారీ సమగ్ర పర్యవేక్షణ చేస్తారని జిల్లా జీఎస్‌డబ్ల్యు అధికారి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి ఆదివారం తెలిపారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో కొవ్వూరు, లాలా చెరువులో డివిజన్ స్థాయి కార్యాలయాలు ప్రారంభించామన్నారు. పర్యవేక్షణకు రూపొందించిన వివిధ డాష్‌బోర్డులు, ఆన్‌లైన్ సమీక్ష పద్ధతులపై ఏపీ ఆన్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ చిరంజీవి, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సహాయ కోఆర్డినేటర్ బాలకృష్ణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఆదివారం తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు తీసుకుని కళాశాలకు ప్రత్యక్షంగా హాజరై స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పీజీ కో ఆర్డినేటర్ మల్లికార్జున పేర్కొన్నారు.



కలెక్టరేట్ భవనం

నాలుగేళ్లయినా.. ఇంతేగా!

తూర్పున నేటికి..ఒక్క భవనమూ కట్టలేదు..

- పాత భవనాల్లోనే సర్దుబాటు
- కొత్త కార్యాలయాల ఊసేలేదు
- అధ్వానంగా కలెక్టరేట్ ప్రాంగణం
- ఐటీసీ భవనంలో మరికొన్ని ఆఫీసులు
- పలు శాఖల విభజన జరగలేదు



తుప్పలతో నిండి ఉన్న కలెక్టరేట్ భవనం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జిల్లాలను హడావుడిగా విభజించారు..వదిలేశారు. కనీస సౌకర్యాలు లేవు.. ఏదో ఉన్నాం చేస్తున్నాం అన్నట్టే ఉంది పరిస్థితి. నాడు వైసీపీ కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్టు చాలా గొప్ప గా చెప్పుకుందే కానీ..కనీసం కలెక్టరేట్‌కు ఒక కొత్త భవనం కూడా నిర్మించలేదు. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని డివిజన్లతో ఏర్పడడంతో అధికారాలు బదలాయింపులో కొంత సమస్య కొనసాగుతోంది. ఎక్సయిజ్ శాఖ విభజన పూర్తిగా జరగలేదు. రాజమహేంద్రవరం డిపో పరిధిలో రాజమహేంద్రవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొంత ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతం ఉంది. చాగల్లు ఎక్సయిజ్ డిపో పరిధిలో కూడా సమస్య ఉంది. ఎస్సీ బీసీ కార్పొరేషన్ల ప్రధాన కార్యాలయాలు కాకినాడలోనే ఉన్నాయి. జిల్లా ప్రజా పరిషత్ (జడ్పీ) విభజన జరగలేదు. జడ్పీటీసీలు, ఉమ్మ డి జిల్లా ఎమ్మెల్యేలు జడ్పీ సమా వేశానికి ఇప్పటికీ కాకినాడ వెళుతున్నారు.కొవ్వూరు డివిజన్‌లో జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు ఏలూరు జడ్పీకి వెళ్లాల్సి వస్తోంది. కలెక్టరేట్‌కు బస్ సౌకర్యం అందుబాటులో లేదు. వచ్చే ఏప్రిల్ నాటికి కొత్త జిల్లాలు ఏర్పడి నాలుగేళ్లు పూర్త వుతుంది. అప్పట్లో వైసీపీ చేసిన నిర్వాకం ఇంకా వెంటా డుతూనే ఉంది. తెలుగు దేశం కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీ కరణ చేపట్టడంతో తూర్పుగోదావరి జిల్లా సరిహద్దులు మారుతు న్నాయి.ఈ నెలాఖరుకి మండపేట నియోజక వర్గం పరిధిలోని మూడు మండలాలు కలవ నుండడంతో జిల్లా హద్దులు మారనున్నాయి.



చుట్టూ ఇంతే : కలెక్టరేట్ ప్రాంగణంలో గడ్డి

కలెక్టరేట్‌నూ కట్టలేదు

2022లో ఏప్రిల్ 4న ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలోని రాజమహేంద్రవరం డివిజన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరు డివిజన్లను కలిపి రాజమమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాను ఏర్పాటు చేశారు. ఏడు నియోజకవర్గాలతో రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లా ఏర్పడింది. జిల్లా అంటే ఏర్పాటు చేశారే కానీ ఒక్క భవనమూ కట్ట లేదు. అప్పట్లో కలెక్ట రేట్ ఎక్కడ పెట్టాలనే కంగారు పట్టుకుంది. కానీ గతంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నిర్మించిన నాక్, వైటీసీ భవ నాలే దిక్కయ్యాయి. అక్కడే ఒకపైసా ఖర్చు లేకుండా కలెక్టరేట్ పెట్టేశారు. అప్పటి నుంచి మార్పేమీ లేదు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వివిధ వృత్తుల్లో నైపుణ్యం పెంచడానికి బొమ్మూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ పేరిట నిర్మిం చిన విశాల భవనంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. నాక్‌ను మాత్రం గతంలో హాస్టల్‌గా వాడుకునే భవనానికి తరిమేశారు. గిరిజన యువత శిక్షణకు అదే ప్రాంతంలో నిర్మించిన వైటీసీ ప్రాంగణాన్ని ఖాళీ చేయించి కొన్ని ప్రభుత్వ శాఖలకు అప్పగించారు. వీటిలో బీరు వా కూడా పట్టని పరిస్థితి.బాత్‌రూమ్‌లు పాడైన పరిస్థితి ఇప్పటికీ ఉంది. జిల్లా కలెక్టర్ నివాస భవనం కొత్తదిలేదు. గతంలో ఇక్కడ సబ్- కలెక్టర్ నివాస భవాన్ని కలెక్టర్ నివాస భవ నంగా వాడుతున్నారు. జేసీ కూడా అద్దె ఇం ట్లోనే ఉంటున్నారు. జిల్లా కలెక్టరేట్ తాత్కాలిక మేనని అప్పట్లో ప్రకటించినా ఎక్కడా కొత్త స్థల సేకరణ చేయలేదు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక కొత్త కలెక్టరేట్ కోసం ధవళేశ్వరం లోని ఇరిగేషన్ స్థలాలను పరిశీలిం చినా కదలికలేదు.



కలెక్టరేట్ భవనంపైకి ఎక్కేస్తున్న పాదులు



పట్టుకుంటే షాక్ : కలెక్టరేట్ ప్రాంగణంలో ఆరుబయట మీటర్



ఎలా వెళ్లేది : ఇరుకు సందులో పీజీఆర్ఎస్ అర్జీదారుల క్యూ

కలెక్టరేట్‌కెళితే.. కర్రతీసుకెళ్లండి!

జిల్లా అంతటికీ దిశానిర్దేశం చేసే కలెక్టరేట్ ప్రాంగణం ఇది.. ఇక్కడేం చెబితే జిల్లా అంతటా అదే జరుగుతుంది.. అంటే ఆ కార్యాలయం ఎంత మోడల్‌గా ఉండాలి.. కానీ చుట్టూ తుప్పలతో నిండి అధ్వానంగా ఉంది.ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌కు వెళితే కర్ర తీసుకుని వెళ్లాల్సిందే.. ఎందుకంటే ఎటు నుంచి పాము వస్తుందో.. ఏమి వస్తుందో తెలియని పరిస్థితి..

విలపింఛన్!

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో..



ఈమె గత బుధవారం ఒడిలో ఉన్న కుమార్తె పింఛను నిమిత్తం అడిగేందుకు నల్లజర్లలో జరిగిన సీఎం చంద్రబాబు సభకు వచ్చారు..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ రాయుడుపాకలకు చెందిన మాచవరపు రిత్విక గ్రేస్‌కు ఆరేళ్లు. దివ్యాంగురాలు.. రెండు కాళ్లు పనిచేయవు.. తరచూ ఫిట్స్ వస్తుంటాయి.. బ్రెయిన్ డ్యామేజీ ఉంది.. దీంతో సదరం సర్టిఫికెట్‌లో 100 శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి చిరు ప్రైవేట్ ఉద్యోగి.. గత నాలుగేళ్లుగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.. నేటికీ నమోదు కాలేదు. కూటమి ప్రభుత్వంలో తప్పనిసరిగా పింఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు.. ఈ ప్రభుత్వంలోనూ ఇదే పరిస్థితి. తమ కుమార్తెకు దివ్యాంగ పింఛన్ ఎప్పుడు మంజూరవుతుందో.. ఎప్పుడు తమ కష్టాలు తీరతాయోనని ఎదురుచూపులు చూస్తున్నారు...

కాకినాడకు చెందిన యాళ్ల లలితకు ప్రస్తుతం ఏడేళ్లు. మానసిక, శారీరక దివ్యాంగురాలు..సదరం సర్టిఫికెట్‌లో వంద శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి తాపీ పని చేస్తుంటాడు.. గత ఐదేళ్లుగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా డు.. నేటికీ నమోదు కాలేదు.కూటమి ప్రభుత్వంలోనైనా పింఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు..ఇప్పుడూ ఇదే పరిస్థితి.

కాకినాడలోని దుమ్ములపేటకు చెందిన కృష్ణవర్ధన్‌కు నాలుగేళ్లు. డ్రోన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం ఇచ్చారు..తండ్రి ఆటోడ్రైవర్. అంతంతమాత్రమే ఆదాయం. గత మూడేళ్లుగా పింఛన్‌కు దరఖాస్తు చేస్తూనే ఉన్నాడు.దరఖాస్తులకు వందల్లో ఖర్చవుతుంది కానీ నేటికీ ఫలితం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిస్థితిలో మార్పు లేదు. దీంతో లబోదిబోమంటున్నారు.

- నోటిఫికేషన్‌కు ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు
- 17 నెలలైనా స్పందన రాక లబోదిబో
- వెల్లువలా దరఖాస్తులు, వినతులు

సామర్లకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలైంది.. నేటికీ కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించడంలేదు. దీంతో వేలాది మంది లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచింది. కొందరికి ప్రత్యేకంగా రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుకు ఎక్కడ లేని డిమాండ్ వచ్చిప డింది. దీంతో దరఖాస్తుదారులు పెరిగారు. కూటమి ప్రభుత్వంలో వెంటనే దరఖాస్తులు స్వీకరిస్తుందని లబ్ధిదారులు అనుకున్నారు.కానీ అలా జరగలేదు. దీంతో ప్రభుత్వం నుంచి స్పందనకు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 60 వేల మంది వరకూ కొత్త పింఛన్లకు అర్హులు ఉన్నట్టు సమాచారం.

ప్రస్తుత పింఛన్లు ఇవే..

జిల్లా	లబ్ధిదారులు	సొమ్ములు
కాకినాడ	2,71,360	117.81 కోట్లు
కోనసీమ	2,36,284	101.86 కోట్లు
తూర్పు	2,35,060	103.27 కోట్లు

నాడు అలా.. నేడు ఇలా..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరంగా జరిగేది. వారం వారం దరఖాస్తులను పరిశీలించి నెలాఖరుకు జాబితా సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధా నానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకోసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెరమీదకు తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొం దిస్తామని చెప్పింది.గడచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వంలో పాతపద్ధతిలో ప్రతీ నెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని భావించినా ఊసేలేదు.

పెండింగ్‌లో 30 వేల దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి సచి వాలయాల్లో నవంబరు 20 నాటికి సుమారు 30 వేల నూతనంగా పింఛన్లకు దరఖాస్తులు ఉన్నట్టు సమాచారం. వీటిలో కనీసం 24 వేల మందికైనా పింఛను అర్హత ఉంటుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 7,42,704 పింఛనుదారులకు ప్రతి నెలా రూ.322.94 కోట్ల మేర సొమ్ములను ప్రతి నెలా చెల్లిస్తున్నారు.ప్రభుత్వం ఇప్పటి వరకూ ఉన్న దరఖాస్తులకు మంజూరు లభిస్తే ప్రభుత్వానికి అదనంగా మరో రూ.12 కోట్ల మేర భారం కానున్నట్టు అంచనా.



మా వైపు చూడండి సార్ : పవన్‌కు దివ్యాంగుల షేక్ హ్యాండ్(ఫైల్)



పరీక్ష రాస్తున్న విద్యార్థులు, పరిశీలిస్తున్న ఆర్డీవో

ఉచిత శిక్షణకు పరీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఆదివారం నిర్వహించిన సివిల్స్ ఉచిత శిక్షణ స్ర్కీనింగ్ పరీక్షకు 126 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ స్ర్కీనింగ్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ప్రతిభ ఆధారంగా సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎంపికైన వారికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. స్ర్కీనింగ్ పరీక్ష విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శశాంక తెలిపారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యువో కేఎన్ జ్యోతి, సహాయ బీసీ సంక్షేమ అధికారులు ముత్యాల సుబ్బారావు, టీవీ ప్రసాద్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఐడియా.. కౌవ్ కేక!

ఒక్క ఐడియా జీవితాన్నే మార్చేస్తోంది.. ఇదీ ఒక యాడ్.. ఈ చిత్రంలో చూడండి.. ఒక్క ఐడియా కౌవ్ కేకలా ఉంది కదా.. ఎందుకంటే రోడ్లపై సంచరించే ఆవుల కారణంగా జిల్లాలో అర్ధరాత్రి ప్రమాదాలు జరిగిన సంఘటనలు బోలెడు.. ఎవరైనా సరే ఆవులపై ఫిర్యాదు చేయడం వదిలేయడం చేసేవారు.. అయితే ధవళేశ్వరానికి చెందిన కొంత మంది మాత్రం చీకట్లో సైతం కనిపించేలా ఆవులకు ఇలా రేడియం బెల్టులు అమర్చుతున్నారు. ఇలా ప్రతి చోటా చేస్తే ప్రమాదాలకు చోటే ఉండవు కదా.. - **ధవళేశ్వరం**



వాట్ యాన్ ఐడియా : ధవళేశ్వరంలో గోవులకు అమర్చిన రేడియం బెల్టులు



సన్‌డే.. ఫన్‌డే..

అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం వద్దకు ఆదివారం అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తాం..

పాపికొండలకు 13 బోట్లలో 900 మంది పర్యాటకులు



పోశమ్మ గండి వద్ద బోటు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు



పర్యాటకులతో పాపికొండలకు వెళ్తున్న బోటు

దేవీపట్నం/వీఆర్‌పురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలను ఆస్వాదించేందుకు తెలుగు రాష్ట్రాలు నలుమూలల నుంచి ఆదివారం 13 పర్యాటక బోట్లల్లో సుమారుగా 900 మంది పర్యాటకులు వెళ్లారు. దీంతో పోశమ్మ గండి వద్ద, పోచవరం ఫెర్రి పాయింట్ దగ్గర పేరంటాలపల్లి శివాలయం (మునిమఠం) వద్ద పర్యాటకులతో పండుగ వాతావరణం ఏర్పడింది. గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, తోయ్యేరు. మూలపాడు, అగ్రహారం, మడిపల్లి, మంటూరు, కచ్చులూరు, తాళ్లూరు, గొందూరు, సుద్దకొండ, తెలిపేరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి చేరుకున్నారు. శివాలయంలో శివుడిని దర్శించుకుని ఆ గ్రామంలో గిరిజనులు తయారుచేసిన వెదురు బొమ్మలను కొనుగోలు చేశారు. ముందుగా ఆ గ్రామ పరిధిలో ఉన్న జలపాతాల వద్ద సందడి చేశారు.



భక్తుడు సమర్పించిన నక్లెస్

సత్యదేవుడికి నక్లెస్ బహూకరణ

అన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడి దేవేరి అనంతలక్ష్మి అమ్మవారి అలంకరణ నిమిత్తం ఆదివారం ఒక భక్తుడు నక్లెస్‌ను విరాళంగా అందజేశారు. నంద్యాల జిల్లాకు జనపల్లి గ్రామానికి చెందిన సి.రాముడు దీనిని ఈవో సుబ్బారావు, అకౌంట్స్‌విభాగ సూపరింటెండెంట్ యనమల అప్పారావు సమక్షంలో అందజేశారు. దీనిబరువు 24.8 గ్రాములుండగా కేవలం బంగారం 8.9 గ్రాములు ఉందన్నారు. ఇతర స్టోన్స్ విలువను లెక్కకట్టమని.. నికర బంగారం విలువ సుమారు రూ.1.05 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఈవో సుబ్బారావుకు నక్లెస్‌ను అందజేస్తున్న దాత

క్రీడాకారులు లక్ష్యాలను సాధించాలి

● 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ ● మహిళా బాస్కెట్‌బాల్ అంతర్ కళాశాలల పోటీలు, యూనివర్శిటీ జట్టు ఎంపికలు

దివాన్‌చెరువు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. విశ్వవిద్యాలయంలో మహిళా బాస్కెట్ బాల్ అంతర్ కళాశాలల పోటీలు, యూనివర్సిటీ జట్టు ఎంపికలు ఆదివారం నిర్వహించారు. హాజరైన వీసీ మాట్లాడుతూ క్రీడల ద్వారా నన్నయ విశ్వవిద్యాలయం ఔన్నత్యాన్ని జాతీయస్థాయిలో చాటిచెప్పే విధంగా కృషి చేయాలన్నారకు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేశారన్నారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 2 వరకూ బెంగుళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ మహిళా బాస్కెట్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. మహిళా బాస్కెట్ బాల్ అంతర్ కళాశాలల పోటీల్లో మొదటి స్థానం ఏలూరులోని సెయింట్ థెరిస్సా, రెండోస్థానం ఏలూరులోని సీఆర్ఆర్ కళాశాల, మూడోస్థానం ఆదిత్య మహిళా కళాశాల క్రీడాకారులు సాధించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, విశ్వవిద్యాలయం అధికార్లు, అధ్యాపకులు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయం బాస్కెట్ బాల్ జట్టుతో వీసీ ప్రసన్నశ్రీ, అధికారులు

నేడు, రేపు 'నన్నయ'లో జాతీయ కార్యశాల

హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దివాన్‌చెరువు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమ, మంగళవారాల్లో భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం అనే అంశంపై జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆదివారం విలేకర్లతో వీసీ మాట్లాడుతూ భారతీయ భాషా సమితి, న్యూఢిల్లీలోని విద్యామంత్రిత్వశాఖ సహకారంతో ఈ కార్యశాలను నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరై జాతీయ కార్యశాలను ప్రారంభిస్తారని చెప్పారు. ఆత్మీయ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్‌డి.విల్సన్, భారతీయ భాషా సమితి సీనియర్ ఎక్స్‌పర్ట్ ఆచార్య ఆర్ఎస్.సర్రాజు, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయ భాషాసమితి అకడమిక్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు దేశ నలుమూలల నుంచి తెలుగు, సంస్కృత భాషల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై మరింత అవగాహన పెంచుకునేందుకు విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులు, పాఠ్య పుస్తకాలు రచించిన విద్యావేత్తలు, భాషాభిమానులు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యశాల కోఆర్డినేటర్‌గా తలారివాసు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా కె.వరప్రసాద్, పి.రాజశేఖర్, ఎన్.నారాయణ, ఎం.రమేష్, ఆనంద్ వ్యవహరిస్తారని తెలిపారు.

అరగంటసేపు భయం భయం...

» ఎక్సలేటర్ వైరు తెగి గోదావరిలో నిలిచిపోయిన పంటు

» ప్రయాణికుల బెంబేలు » మరో పంటు సాయంతో క్షేమంగా ఒడ్డుకు

అంతర్వేది, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి-నర్సాపురం వశిష్ట గోదావరి రేవు మధ్యలో ప్రయాణికులతో వెళ్తున్న పంటు ఆదివారం అరగంటసేపు నిలిచిపోయింది. పంటుకు ఉన్న ఎక్సలేటర్ వైరు తెగి ప్రయాణికులు వాహనాలతో ఆగిపోవడంతో భయాందోళన చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి సఖినేటిపల్లి రేవుల మధ్య నిత్యం వేలాది మంది పంటుపై ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం పంటు గోదావరిలో నిలిచిపోవడంతో వేరే పంటు సాయంతో నిలిచిపోయిన పంటును ఒడ్డుకు తీసుకువచ్చారు. సఖినేటిపల్లి రేవులో గోదావరిపై అంతర్వేది సాగర సంగమం నుంచి వచ్చే ఆటుపోట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నిలిచిపోయిన పంటు స్థిరంగా ఉండక పాటు సమయం కావడంతో నెమ్మదిగానే కదలిక సాగింది. అదే పోటు సమయంలో అయితే పంటు వేగానికి అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సుమారు 80 మంది ప్రయాణికులు, సుమారు 20 దిచక్రవాహనాలు, ఒక కారు పంటులో ఉన్నాయి. పంటును ఒడ్డుకు తీసుకురావడంతో వీరంతా ఊపిరి పీల్చుకున్నారు.



సఖినేటిపల్లి రేవులో పంటును వేరే పంటు సాయంతో ఒడ్డుకు తీసుకెళ్తున్న దృశ్యం

గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన

● చర్చిలు మూసివేయాలని డిమాండ్

● ఆరుగంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు

● తాత్కాలికంగా మూసివేతకు ఆదేశం

● పోలీసు పికెట్ ఏర్పాటు



ఆందోళనకు దిగిన హిందూ సంఘాల ప్రతినిధులు

గొల్లప్రోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన, అదే సమయంలో చర్చిల వద్దకు వెళ్లేందుకు క్రైస్తవులు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోలీసు బలగాలు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చర్చిలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆర్డీవో ఆదేశించారు. సుమారు ఆరుగంటల పాటు ఆందోళనలు, ఉద్రిక్తతలు కొనసాగాయి.

అసలేం జరిగిందంటే...

గొల్లప్రోలు కొత్తపేట ప్రాంతంలో ఉన్న రెండు చర్చిల నిర్వహణపై అక్కడ స్థానికులు కొంతకాలంగా అభ్యంతరం తెలుపుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా చర్చిలు నిర్వహిస్తున్నారని, లౌడ్‌స్పీకర్లు వినియోగిస్తున్నారని తెలిపారు. దీనిపై ఎటువంటి స్పందన లేకపోవడంతో హిందూ సంఘాలు ఆందోళన కు పిలుపునిచ్చాయి. హిందూ ధర్మ రక్షా సమి తి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవరయ్య ఆ ధ్వర్యంలో చర్చిల ప్రాంతంలో ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తతలు ఏర్ప డ్డాయి. అదే సమయంలో చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. దీంతో కాకినాడ రూరల్, త్రీటౌన్ సీఐలు చైతన్యకృష్ణ, సత్యనారాయణల ఆధ్వర్యంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్ఐలు రామకృష్ణ, మణికుమార్, లోకేష్, వెంకటేష్ అక్కడకు చేరుకున్నారు. హిందూ సంఘాలతో చర్చలు జరిపారు. చర్చిలు మూసివేసే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ గవరయ్య స్పష్టం చేశారు. చర్చిల్లో ఉన్న వారిని బయటకు పంపివేశారు. కొంత సమయం తర్వాత క్రైస్తవులు అక్కడకు చేరుకునేందుకు గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం నుంచి తరలివచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు.

ఆర్డీవో చర్చలు

విషయం తెలుసుకున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, గొల్లప్రోలు తహశీల్దార్ రామ్‌కుమార్, నగరపంచాయతీ టీపీవో దీప్తి కొత్తపేటకు చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చలు జరిపారు. చర్చిలకు అనుమతులు లేవని, ఆక్రమణలు ఉన్నాయని హిందూ సంఘాల ప్రతినిధులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో ఉన్న రెండు చర్చిలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు. అదేవిధంగా కొత్తపేట ప్రాంతంలో సీఆర్‌పీసీ 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. ఆక్రమణలు ఉన్నాయన్న ఫిర్యాదుల మేరకు సర్వే నిర్వహించి మార్కింగ్ చేయాలని టీపీవోను ఆర్డీవో ఆదేశించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో చర్చిల నిర్వాహకులతో చర్చలు జరిపారు. కలెక్టర్‌ను సోమవారం కలవాలని సూచించారు. మరోవైపు ఆర్డీవో హామీతో హిందూ సంఘాలు ఆందోళన విరమించాయి. అక్కడ ఏ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు గానూ ముందుజాగ్రత్త చర్యగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.



చర్చిల నిర్వాహకులతో చర్చలు జరుపుతున్న ఆర్డీవో

వంద పువ్వులే... వికసించెలే..

కొత్తపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన పురోహితుడు పెద్దింటి రామం ఇంటి పెరటిలో వేసిన బ్రహ్మకమలం మొక్కకు ఒకేసారి 100 పువ్వులు వికసించడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రామం ఈ మొక్కను 4 సంవత్సరాల కితం చెన్నై నుంచి ప్రత్యేక తెప్పించుకున్నారు. గత నాలుగేళ్లలో ఇప్పటి వరకూ 5వేల వరకూ పువ్వులు వికసించాయని, ఆదివారం 100 పుష్పాలు వికసించాయన్నారు. ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో సంరక్షణ చేయడంతో ఆరోగ్యకరంగా మొక్క పెరిగి పుష్పాలతో విరబూస్తుందని, ఇది శుభసూచికమని తెలిపారు.



మన్యంలో పెరిగిన చలి

మోతుగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు దట్టంగా కమ్ముకుంటుంది. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో మంచు దెబ్బకు వాహనాలు నెమ్మదిగా ప్రయాణించవలసి వస్తుంది. చలి తీవ్రతంగా కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. అయితే మంచులో అందమైన దృశ్యాలు కనిపించడంతో పలువురు కెమెరాలతో ఇక్కడ షూటింగ్‌లు చేస్తున్నారు.





మోతుగూడెం- పొల్లూరు మార్గంలో పొగమంచు దృశ్యాలు

ధాన్య పరమేశ్వరుడిగా రామలింగేశ్వరస్వామి

ధాన్యం, వరి కంకులతో అలంకారం



స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైన పంచాయతన సమేత ఉమారామ లింగేశ్వరస్వామి ధాన్యపరమేశ్వరుడి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు నిర్వహించారు. వరి కంకులు, ధాన్యంతో ధాన్య పరమేశ్వరుడిగా అలంకారం చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. రైతులు పండించే ఆహార ధాన్యాల పంటలు సక్రమంగా చేతికందాలని కోరుతూ ఈ అలంకారం చేసినట్టు ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో ఆదివారం మోటూరి భైరవస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి 3 స్థానాల్లో నిలిచిన వారిని విజేతలుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, నేషనల్ యోగా జడ్జి మోటూరి భైరవస్వామి ప్రకటించారు. జాతీయస్థాయిలో జరిగే పోటీలకు 8మందిని ఎంపిక చేసినట్టు వివరించారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో బి.మధు, ఎన్.శ్రావణి, కె.సురేంద్ర, ఎం.అనిల్‌కుమార్, ఎ.ప్రవల్లిక, కె.దుర్గాభవాని, సీహెచ్.నరేంద్రకుమార్, పి.హర్షవర్ధన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రథమస్థానం సాధించిన విద్యార్థులు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈనెల 28న రాజమహేంద్రవరంలో జరిగే పోటీలకు పంపనున్నట్టు తెలిపారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో యోగా గురువు భైరవస్వామి

స్కూల్‌గేమ్స్‌లో యానాం విద్యార్థుల ప్రతిభ

యానాం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2025-26 పోటీల్లో యానాం విద్యార్థులు ప్రతిభ సాధించారు. వెయిట్ లిఫ్టింగ్ 53 కిలోల విభాగంలో యానాం విద్యార్థిని సీహెచ్.మహాశరణ్య ప్రథమస్థానం, 48 కిలోల విభాగంలో వి.ఎల్.ధనశ్రీ, 44కిలోల విభాగంలో ఎమ్.సూర్యకార్తీ, 98 కిలోల విభాగంలో ఎం.సురేష్ తృతీయస్థానం కైవసం చేసుకున్నారు. బాలురు అండర్ 17వాలీబాల్ విభాగంలో ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు.



వాలీబాల్ విభాగంలో ప్రతిభ సాధించిన యానాం విద్యార్థులు

పంటకాల్వలోకి దూసుకెళ్లిన కారు

యువకుడి మృతి



శ్యామ్‌తేజ (ఫైల్)

రాజోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం కడలిలో పంట కాల్వలోకి ఆదివారం కారు దూసుకెళ్లడంతో శ్యామ్‌తేజ (20) మృతిచెందాడని రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. ములికిపల్లికి చెందిన కలిగితి శ్యామ్‌తేజ కారులో పి.గన్నవరం వెళ్లి ములికిపల్లికి వస్తుండగా కడలి పెట్రోలు బంకు సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న ప్రధాన పంటకాల్వలోకి దూసుకెళ్లడంతో శ్యామ్‌తేజ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



పంటకాల్వ నుంచి బయటకు తీసిన కారు

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

కన్నుల పండువగా కనకదుర్గమ్మ తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, డిసెంబరు 7: మండలంలో చక్రద్వారబంధం-సూర్యారావుపేట గ్రామ పొలిమేరల్లో జాతీయ రహదారిని ఆనుకుని కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ 45వ తీర్థ మహోత్సవాలు ఆదివారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ బారికేడ్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బత్తుల బ లరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు నడుమ అమ్మవారి తీర్థం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో తీర్చిదిద్దారు.హైవేపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుల బందోబస్తు నడుమ అమ్మవారి తీర్థం జరిపించారు.

మధురపూడిలో..

కోరుకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురపూడిలో జరుగుతున్న కనకదుర్గమ్మ జాతరలో భాగంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సీనియర్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆడిట్ మెంబర్ ఈశ్వరరెడ్డి

బిక్కవోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీనియర్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర టీచర్స్ యూనియన్ ఆడిట్ మెంబర్ తమలంపూడి ఈశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బిక్కవోలులో శనివారం రాత్రి మండల ఎస్టీయూ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే ఐఆర్ ప్రకటించి పీఆర్సీ కమిటీ వేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నిలిపి వేయాలని, యాప్‌ల భారం తొలగించాలన్నారు. అనంతరం మండల ఎస్టీయూ అధ్యక్షునిగా నాగసూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ద్వారంపూడి నాగేంద్రరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా బండారు దుర్గారావులతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి

ముగిసిన ఐఎస్‌టీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



రాజానగరంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల అవగాహన ర్యాలీ

రాజానగరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగోనగూడెంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ ఉమెన్(ఐఎస్‌టీఎస్) కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం ఆదివారం ముగిసింది. దీనిలో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, మహిళపై జరుగుతున్న అకృత్యాలు, అరాచకాలను అరికట్టాలంటూ ప్లకార్డుల ప్రదర్శన,ర్యాలీ ద్వారా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజానగరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన ముగింపు సభలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. అనంతరం వలంటీర్లకు కళాశాల ఏవో ఇక్బాల్, ప్రిన్సిపాల్ రాజశ్రీరావు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాజానగరం సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవోలు గండేపల్లి శ్రీలక్ష్మి, మన్యం వెంకట్, కోఆర్డినేటర్ దాసరి రేమాల్య, జె.సునీత, దుర్గాభవాని, సాయి శ్రావణి, లక్ష్మీకావ్య, దివ్యరత్న మాణిక్యం పాల్గొన్నారు.

జనసైనికుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న జనసైనికులు

ధవళేశ్వరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన నాయకుడు ఆదివారం గ్రామంలోని జనసైనికులు, వీర మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీరా జయప్రకాష్, యడ్ల మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామంలోని సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే గోరంట్ల, మంత్రి కందుల దుర్గేష్, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. అలాగే సోమవారం ఉదయం ఎర్రకొండ హైవే స్కూల్ సమీపంలో పేరుకుపోయిన చెత్తను శ్రమదానం చేసి తొలగించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

సుందరేశ్వరస్వామికి అన్నాభిషేకం

కొవ్వూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పంచామృత అభిసేకాలు, అన్నాభిషేకాలు చేశారు. అలాగే సంస్కృ పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీలలితా పార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాల్లో పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ వలయం

దేవిచౌక్ రహదారుల్లో వాహనాల రద్దీ

- లక్ష్మీవారపుపేట దారిలో అధికం
- రోడ్డుకు అడ్డంగా పార్కింగ్‌లు
- ఇబ్బందుల్లో నగర వాసులు



రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో వాహనాల రద్దీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన దేవిచౌక్ రహదారులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని కొట్టిమిట్టాడుతున్నాయి. సాధారణంగా రాజమహేంద్రవరంలో దేవిచౌక్, గోకవరం బస్టాండ్ సెంటర్, ఆజాద్ చౌక్, అప్సర సెంటర్, డీలక్స్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్, తాడితోట, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, దానవాయిపేట పాత సిటీ హాస్పిటల్ సెంటర్, వై-జంక్షన్, క్వారీ సెంటర్, సీతంపేట వాటర్ ట్యాంక్‌ల సెంటర్లు నిత్యం రద్దీగా ఉంటాయి. ట్రాఫిక్ కాస్త అధికంగా ఉంటుంది. కాని దేవిచౌక్ సెంటర్‌కు మిగిలిన సెంటర్లకు చాలా వ్యత్యాసం ఉంటుంది. మిగిలిన ప్రాంతాల్లో జంక్షన్ మొదలుకొని సైడ్ రోడ్డుకు వచ్చే వరకు కూడా రహదారులు విశాలంగా ఉంటాయి. కాని దేవిచౌక్‌లో రెండు రోడ్లు మాత్రమే విశాలంగా ఉండి మరో రెండు రోడ్లు ఇరుకుగా ఉంటాయి.దీని వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. అక్కడ విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు ఇది కత్తిమీద సామే.



కార్లు, బైక్‌లతో నిండిపోయిన దేవిచౌక్-లక్ష్మీవారపుపేట రోడ్డు

రోడ్డుపైనే వాహనాలు

దేవిచౌక్ నుంచి లక్ష్మీవారపు పేట వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థలకు వచ్చిన వారి వాహనాలు, అందులో పనిచేస్తున్న వారి వాహనాలు రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్క్ చేసి వదిలేస్తారు. దీని వల్ల ఆ రోడ్డులోకి వాహనం వెళ్లాలంటేనే ఇబ్బంది. ఈ రోడ్డులో వ్యాపార సంస్థలు ఉన్నాయి, కాని ఎవ్వరికి పార్కింగ్ స్థలం లేదు. భవనాల కింద సెల్లార్లు లేవు, పార్కింగ్ లేదు. దీంతో మొత్తం బైక్‌లు కార్లు అన్ని రోడ్డుపైన పెట్టేస్తారు. మెయిన్‌రోడ్డుకు దేవిచౌక్-లక్ష్మీవారపు పేట రోడ్డు అనుసంధానంగా ఉండడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో తరచు ఈ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అవుతుంది. మరో పక్క దేవిచౌక్ నుంచి ఆజాద్‌చౌక్‌కు వెళ్లే దారిలో కూడా బైక్‌లు, కార్లు డివైడర్ ఉన్న స్థలంలో పార్కింగ్ చేసేయడం వల్ల ఈ రోడ్డు కూడా రద్దీగా మారుతుంది. ఇలా దేవిచౌక్ జంక్షన్ ట్రాఫిక్ వలయంలో కొట్టిమిట్టాడుతోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సెంటర్‌కు పార్కింగ్‌ను కేటాయించాలని, రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని, రహదారి విస్తరణ చేయాలని నగర ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే లేకుంటే పుష్కరాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని అంటున్నారు.

ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- అనపర్తిలో రాష్ట్ర కరాటే పోటీలు
- హాజరైన 1200 మంది విద్యార్థులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ ఆరోగ్యం కోసమే కాకుండా ఆత్మ రక్షణకూ దోహదపడుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని టీటీడీ కళ్యాణ మండపంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతోత్సవాల సందర్భంగా జపాన్ షాటోకాన్ కరాటే కన్నిన్సు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అటల్‌జీ కరాటే టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ ప్రతినిధి గుర్రాల వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ ప్రస్తుత తరుణంలో మార్షల్ ఆర్ట్స్ బాలికలకు ఎంతో ఉపకరిస్తుందని ప్రమాద పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు ప్రతి బాలిక కరాటేలో శిక్షణ పొందాలన్నారు. నాగేంద్ర మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌పై బాలికల్లో మక్కువ పెరగడం అభినందనీయమన్నారు. కాగా పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌కు ఆర్థిక సహకారం అందించిన తేతల ఉపేంద్రరెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, తాడి శశిధర్‌రెడ్డిలను, టోర్నమెంట్ నిర్వాహకుడు కర్రి నాగిరెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు.కార్యక్రమంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, గొల్లు హేమతులసి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీను పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో, ఇబ్బందుల్లో ఉన్న పేద విద్యార్థులకు తాము, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక లింగంపేట వాంబే కాలనీకి చెందిన 8వ తరగతి చదువుతున్న కె.యశ్వంత్, 5వ తరగతి చదువుతున్న కె.లహరిలకు స్థానిక తిలక్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో భవానీ చారిటబుల్ ట్రస్ట్ తరుపున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరుపున నిత్యం ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని, పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

స్థానిక 40వ డివిజన్‌లో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి కొల్లి నాని గతంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరానికి సంబంధించి కంటి పరీక్షలు చేయించుకున్న 136 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ జరిగింది. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్య అతిథిగా విచ్చేసి నాని మిత్ర బృందాన్ని అభినందించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తానున్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి బుడ్డిగ రవి, తవ్వా రాజా,కరగాని వేణు, మళ్లవెం కట్రాజు, చాపల చినరాజు, సమ్మంగి దుర్గాప్రసాద్, హరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

ఎస్‌కేఆర్ హాస్టల్లో వైద్య శిబిరం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హితకారిణి సమాజం నిర్వహిస్తున్న స్థానిక ఎస్‌కెఆర్ ఉమెన్స్ హాస్టల్‌లో యాళ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్య అతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య ద్వారానే మహిళల ఆర్థిక, సామాజిక జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్థాపించిన హితకారిణి సమాజం నేటికీ మహిళల విద్య కోసం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. యాళ్ల ప్రదీప్ సుకుమార్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరపున హాస్టల్‌లోని 250 మంది విద్యార్థినులకు రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే రూ.60 వేలు విలువ చేసే ఎమర్జెన్సీ మెడికల్ కిట్లను హాస్టల్ వార్డెన్ ఎం.విశాలాక్షికి అందజేశారు.కార్యక్రమంలో ఏవీవీ సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు,ఎంఎస్ భాగ్యలక్ష్మి, కుచ్చెర్లపాటి లలితారాణి, సీహెచ్ఎస్ నాగవల్లి, కొడమళ్ల శ్రీనివాసరావు, తణుకు శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రజలకు డిజిటల్ చెల్లింపుల, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే, అక్కడి ఉన్నత పాఠశాలలో వర్మీ కంపోస్టును ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ పీవో హెచ్.శ్రీరామ్‌పవన్, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన గోలింగేశ్వర ఆలయం



బిక్కవోలులో అలంకార రూపంలో ఉన్న గోలింగేశ్వరస్వామి

బిక్కవోలు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర కావడంతో ఆదివారం బిక్కవోలు గోలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే బలభద్రపురంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలను, ఇళ్లపల్లిలోని పాదరస లింగాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

'పంచ పరివర్తనతోనే హిందూ సమాజం బలోపేతం'

గోకవరం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పంచ పరివర్తనతోనే హిందూ సమాజం బలోపేతమవుతుందని పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఆర్ఎస్ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కొత్త రామకృష్ణ అన్నారు. గోకవరం గ్రామ దేవత గుబ్బాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి వందేళ్లు పూర్తైన సందర్భంగా ప్రతీ మండలంలో హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. పంచ పరివర్తన కార్యక్రమాలైన సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన, పౌర కర్తవ్యం, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ వంటి అంశాలతో హిందూ సమాజం మరింత శక్తివంతమవుతుందన్నారు. సమాజంలో అందరినీ సమానంగా చూడాలన్నారు. పౌరులుగా దేశ చట్టాలను గౌరవిస్తూ సామాజిక బాధ్యత నిర్వర్తించాలని, ప్లాస్టిక్‌ని నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, స్వదేశీ వస్తు వినియోగం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు.ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురిని సత్కరించారు.కార్యక్రమంలో దేశాబత్తుల సత్యనారాయణ, కంచర్ల సూర్యప్రకాశరావు,దాసరి తమ్మన్నదొర, దాసరి చినబాబు, పులపర్తి బుజ్జి పాల్గొన్నారు.

పడుతూ..లేస్తూ

గోతులమయంగా రాజానగరం-కలవచర్ల రహదారి

- ఇబ్బందుల్లో వాహనదారులు
- కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు
- చోద్యం చూస్తున్న అధికారులు



రాజానగరం నుంచి కలవచర్ల వెళ్లే రహదారి

రాజానగరం/దివాన్‌చెరువు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోతుల మయంగా మారిన రాజానగరం-కలవచర్ల రహదారికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మోక్షం లభించడం లేదు. రాజానగరం నుంచి కలవచర్ల, సీతారాంపురం మీదుగా గాదరాడ వెళ్లే ప్రధాన రహదారి పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ద్విచక్ర వాహనదారులు ఒక గొయ్యి తప్పించబోయి మరో గోతిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దాదాపు రెండేళ్లకు పైగా ఈ రహదారి పరిస్థితి ఇలానే ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఈ రహదారిపై కలవచర్ల వేళ్లేందుకు నరకయాతన అనుభవించవలసి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. దీనితో తాము దాదాపు మరో నాలుగు కిలో మీటర్లు దూరం అనగా కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి వరకూ వెళ్లి అక్కడ నుంచి కలవచర్ల వెళ్తున్నామని చెబుతున్నారు. దీంతో అధిక వ్యయప్రయాసలకు గురవుతున్నామని పలువురు వాపోయారు. దాదాపు పదేళ్ల క్రితమే ఈ రహదారి విస్తరణకు నిధులు మంజూరై, పనులు కూడా ప్రారంభించారు. విస్తరణ పేరుతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు అర్థాంతరంగా ఆగిపోయినప్పటికీ సంబంధిత ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికార్లు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి పనులను సత్వరం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



దివాన్‌చెరువు నుంచి శ్రీరాంపురం వెళ్లే రహదారి దుస్థితి(ఫైల్)

వాహనదారుల ఇక్కట్లు

దివాన్‌చెరువు- శ్రీరాంపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో కొంత దూరం అక్కడక్కడ చిన్నచిన్నగుంతలు ఏర్పడడంతో ఈ రహదారిపై ప్రయాణాలు సాగించే వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దివాన్‌చెరువు నుంచి శ్రీరాంపురం వెళ్లేరోడ్డలో దాదాపు మూడు సంవత్సరాల క్రితం సిమ్మెంట్ రోడ్డు వేశారు. ఈ రోడ్డు దాటిన దగ్గర నుంచి శీతలపానీయాల గిడ్డంగుల సమీపం నుంచి దాదాపు 50 మీటర్లు మేర రహదారి గుంతలమయంగా మారింది. శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం. తుంగపాడు తదితరగ్రామాలకు వెళ్లి వచ్చే ప్రయాణికులు ఈ రహదారి మీదుగానే ప్రయాణిస్తారు. అయితే రహదారిపై పడ్డ గుంతలు వల్ల అవస్థలు తప్పడంలేదుని పలువురు వాపోతున్నారు. ఈ రహదారిపై తరచూ నీరు డ్రైనేజీలోకి పోకుండా నిలిచిపోతుండడం కూడా కారణమని కొంతమంది స్థానికులు అంటున్నారు. ఈ రహదారిలో కొంతమేర వీధిదీపాలు లేనికారణంగా చీకటి పడితే ఈ రహదారిలో మరికొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని అంటున్నారు. ఈ రహదారిలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, ప్రత్యేక తరగతులకు హాజరై తిరిగి ఇళ్లకు వెళ్లే అయా పాఠశాలల విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ రహదారిపై పడ్డ గుంతలను పూడ్చివేసేందుకు, రహదారి అంచులు లేనిచోట వాటి ఏర్పాటుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాగా గుంతలు పడ్డ రహదారి మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నట్టు రహదారులు, భవనాల శాఖ అధికారి ద్వారా తెలిసింది.

సీఐటీయూ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కొవ్వూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా జనవరి 4న సీఐటీయూ 18వ జాతీయ మహసభలను విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి ఎం. సుందరబాబు తెలిపారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జాతీయ మహసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నో ప్లాస్టిక్ నినాదంతో ఈ సభలు జరుగుతాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థల రక్షణ, అసంఘటిత రంగ కార్మికుల భద్రత, స్కీం వర్కర్లకు కనీస వేతనం అందించాలని, నాలుగు లేబర్‌కోడ్‌లను తిప్పికొట్టడం తదితర అంశాలపై చర్చించి, పోరాటాలకు కార్యాచరణ రూపకల్పన చేస్తామన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్రాహ్మణ సేవా ట్రస్టు ద్వారా చదువులో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. ఆదివారం స్థానిక మల్లిగ సత్రంలో 2024-25 సంవత్సరానికి 100 మంది విద్యార్థులకు రూ.5 లక్షలను స్కాలర్‌షిప్‌ల రూపేణా అందజేశారు. ఉపకార వేతనాలను ట్రస్టు సభ్యులు దంతుర్తి ప్రసాద్, గాడేపల్లి సత్యనారాయణమూర్తి, చీమలకొండ వీరప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి పంపిణీచేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి, సామర్లకోట చాణక్య కుమార భీమేశ్వర స్వామి ఆలయానికి డైరెక్టర్‌గా నియమితులైన చీమలకొండ వర ప్రసాద్‌లను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రేగడమిల్లి రామ్‌దేవ్‌శర్మ, జ్యోష్యభట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

గోకవరంలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు


గోకవరం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామ శివారు దేవీపట్నం పునరావాస కాలనీ వద్ద ఆదివారం పెను ప్రమాదం తప్పింది. ఓ కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. నిత్యం జనసంచారంతో ఉండే ఆ ప్రాంతం ప్రమాదం సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను కాలనీ వాసులు నిలదీయగా నా ప్రాణం నా ఇష్టం..చస్తే చస్తాను అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కనకదుర్గమ్మ.. వీరవరం వాసుల ఆరాధ్యదైవం



కన్నుల పండువగా అమ్మవారి తీర్థం

కడియం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవరం గ్రామంలో పచ్చని పంట పొలాల మధ్య ఐదు దశాబ్ధా క్రితం ఓ మామిడిచెట్టు కింద వెలసిన దుర్గాదేవి గ్రామస్థుల ఆరాధ్యదైవంగా పూజలు అందుకుంటోంది. ప్రతీ శుక్రవారంతో పాటు దసరా రోజుల్లో నవరాత్రులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తుంటారు. గ్రామస్థులు ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా అమ్మవారికి సారె, చీర పెట్టి ఇంటి ఆడపడుచుగా భావించి పూజలు చేస్తారు. ఏటా ఐదు రోజుల పాటు తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తుంటారు. గ్రామ ఆడపడుచులు ఎక్కడ ఉన్నా వీరవరం వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.







కోటసత్తెమ్మ ఆలయంలో రెండు చేతుల పైకెత్తి మొక్కుకుంటున్న మహిళలు

కాపాడమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాపాడమ్మా కోటసత్తెమ్మ అంటూ మహిళలు మొక్కుకున్నారు.కోటసత్తెమ్మ తిరునాళ్లలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నూటొక్క మంది మహిళలు కలశాలతో అమ్మవారికి ఊరేగింపుగా చీర, సారె సమర్పించారు. అర్చకుడు అప్పారావు శర్మ అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, దేవస్థానం సహాయ కమిషనర్ హరి సూర్య ప్రకాష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హమ్మయ్య..ఇన్నాళ్లకు రోడ్డు పనులు!



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆ రోడ్డులో వెళ్లాలంటే నరకమే.. పడుతూ లేస్తూ వెళ్లాల్సిందే.. ఎందుకంటే అంత పెద్ద గోతులు మరి..అదే పెరవలి మండలంలోని కానూరు- ఉసులుమర్రు రోడ్డు.. అయితే ఆ రోడ్డు పనులకు మోక్షం కలిగింది. సుమారు 3 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రోడ్డు పనులను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఇలా ఎక్స్‌కవేటర్ ఎక్కి ప్రారంభించారు.గత ప్రభుత్వ హయాంలో పెనుగొండ నుంచి నిడదవోలు వరకు ఈ రహదారి వేసినప్పటికి నాణ్యత లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఈ ప్రాంత ప్రజలు సిమెంట్ రోడ్డు కావాలని అడగడంతో స్పందించిన మంత్రి ప్రభుత్వ అనుమతి పొందారు. పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టైమ్‌కి భోజనం పెట్టరా?

మధ్యాహ్నం 2:30 గంటలకు భోజనం - వార్డెన్‌పై ఎమ్మెల్యే వాసు ఆగ్రహం



హాస్టల్ వార్డెన్‌పై మండిపడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల వరకూ భోజనం ఎందుకు పెట్టలేదు ? ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. అధికారులు సక్రమంగా పనిచేయకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించేదిలేదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాజమహేంద్రవరంలోని ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1 లేడీవార్డెన్‌పై మండిపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో విద్యార్థులకు అన్నం పెడుతున్న విషయాన్ని గుర్తించారు. ప్రతి ఆదివారం భోజనం ఇలా లేట్ అవుతోందా ? సిబ్బంది ఎంతమంది ఉన్నారు అని ఆరా తీశారు. దీనిపై హాస్టల్ వార్డెన్ ప్రభావతి పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు పెట్టే మెనూ చార్టు లేకపోవడంపై వార్డెన్‌ను ప్రశ్నించారు. తక్షణమే మెనూ రాయించండి అని ఆదేశించారు. ఈ సమయంలో పలువురు విద్యార్థులు హాస్టల్ సిబ్బంది భోజనం వడ్డించడంలేదని, మెనూ అమలు చేయడంలేదని, నాన్ వెజ్, ఇతర కూరలు రుచీపచీలేకుండా ఉంటున్నాయని, సరిగా పెట్టడంలేదని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ దళిత నాయకులు ఎస్సీ హాస్టళ్లను తరచూ సందర్శించి.. సమస్యలు తెలుసుకోవాలని కాశి నవీన్‌కుమార్‌కు సూచించారు. తక్షణమే విద్యార్థులతో మెస్ కమిటీ ఏర్పాటు చేయాలని, మెనూ బోర్డు పెట్టాలని లేడీ వార్డెన్‌ను ఆదేశించారు.

పౌరసేవలపై శిక్షణ

రాజమహేంద్రవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 21 మండలాల పరిధిలో 512 సచివాలయాల ద్వారా 4067 మంది సిబ్బందితో 6,54,119 కుటుంబాలకు చెందిన 18,32,965 మంది ప్రజలకు అందిస్తున్న సేవలను ఇక మండలాల వారీ సమగ్ర పర్యవేక్షణ చేస్తారని జిల్లా జీఎస్‌డబ్ల్యు అధికారి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి ఆదివారం తెలిపారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో కొవ్వూరు, లాలా చెరువులో డివిజన్ స్థాయి కార్యాలయాలు ప్రారంభించామన్నారు. పర్యవేక్షణకు రూపొందించిన వివిధ డాష్‌బోర్డులు, ఆన్‌లైన్ సమీక్ష పద్ధతులపై ఏపీ ఆన్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ చిరంజీవి, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సహాయ కోఆర్డినేటర్ బాలకృష్ణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే ఆదివారం తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు తీసుకుని కళాశాలకు ప్రత్యక్షంగా హాజరై స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పీజీ కో ఆర్డినేటర్ మల్లికార్జున పేర్కొన్నారు.

నాలుగేళ్లయినా.. ఇంతేగా!

తూర్పున నేటికి..ఒక్క భవనమూ కట్టలేదు..



కలెక్టరేట్ భవనం

కలెక్టరేట్‌నూ కట్టలేదు

2022లో ఏప్రిల్ 4న ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలోని రాజమహేంద్రవరం డివిజన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరు డివిజన్లను కలిపి రాజమమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాను ఏర్పాటు చేశారు. ఏడు నియోజకవర్గాలతో రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లా ఏర్పడింది. జిల్లా అంటే ఏర్పాటు చేశారే కానీ ఒక్క భవనమూ కట్ట లేదు. అప్పట్లో కలెక్ట రేట్ ఎక్కడ పెట్టాలనే కంగారు పట్టుకుంది. కానీ గతంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నిర్మించిన నాక్, వైటీసీ భవ నాలే దిక్కయ్యాయి. అక్కడే ఒకపైసా ఖర్చు లేకుండా కలెక్టరేట్ పెట్టేశారు. అప్పటి నుంచి మార్పేమీ లేదు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వివిధ వృత్తుల్లో నైపుణ్యం పెంచడానికి బొమ్మూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ పేరిట నిర్మిం చిన విశాల భవనంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. నాక్‌ను మాత్రం గతంలో హాస్టల్‌గా వాడుకునే భవనానికి తరిమేశారు. గిరిజన యువత శిక్షణకు అదే ప్రాంతంలో నిర్మించిన వైటీసీ ప్రాంగణాన్ని ఖాళీ చేయించి కొన్ని ప్రభుత్వ శాఖలకు అప్పగించారు. వీటిలో బీరు వా కూడా పట్టని పరిస్థితి.బాత్‌రూమ్‌లు పాడైన పరిస్థితి ఇప్పటికీ ఉంది. జిల్లా కలెక్టర్ నివాస భవనం కొత్తదిలేదు. గతంలో ఇక్కడ సబ్- కలెక్టర్ నివాస భవాన్ని కలెక్టర్ నివాస భవ నంగా వాడుతున్నారు. జేసీ కూడా అద్దె ఇం ట్లోనే ఉంటున్నారు. జిల్లా కలెక్టరేట్ తాత్కాలిక మేనని అప్పట్లో ప్రకటించినా ఎక్కడా కొత్త స్థల సేకరణ చేయలేదు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక కొత్త కలెక్టరేట్ కోసం ధవళేశ్వరం లోని ఇరిగేషన్ స్థలాలను పరిశీలిం చినా కదలికలేదు.



తుప్పలతో నిండి ఉన్న కలెక్టరేట్ భవనం

- పాత భవనాల్లోనే సర్దుబాటు
- కొత్త కార్యాలయాల ఊసేలేదు
- అధ్వానంగా కలెక్టరేట్ ప్రాంగణం
- ఐటీసీ భవనంలో మరికొన్ని ఆఫీస్‌లు
- పలు శాఖల విభజన జరగలేదు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జిల్లాలను హడావుడిగా విభజించారు..వదిలేశారు. కనీస సౌకర్యాలు లేవు.. ఏదో ఉన్నాం చేస్తున్నాం అన్నట్టే ఉంది పరిస్థితి. నాడు వైసీపీ కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్టు చాలా గొప్ప గా చెప్పుకుందే కానీ..కనీసం కలెక్టరేట్‌కు ఒక కొత్త భవనం కూడా నిర్మించలేదు. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని డివిజన్లతో ఏర్పడడంతో అధికారాలు బదలా యింపులో కొంత సమస్య కొనసాగుతోంది. ఎక్సయిజ్ శాఖ విభజన పూర్తిగా జరగలేదు. రాజమహేంద్రవరం డిపో పరిధిలో రాజమహేంద్రవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొంత ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతం ఉంది. చాగల్లు ఎక్సయిజ్ డిపో పరిధిలో కూడా సమస్య ఉంది. ఎస్సీ బీసీ కార్పొరేషన్ల ప్రధాన కార్యాలయాలు కాకినాడలోనే ఉన్నాయి. జిల్లా ప్రజా పరిషత్ (జడ్పీ) విభజన జరగలేదు. జడ్పీటీసీలు, ఉమ్మ డి జిల్లా ఎమ్మెల్యేలు జడ్పీ సమా వేశానికి ఇప్పటికీ కాకినాడ వెళుతున్నారు.కొవ్వూరు డివిజన్‌లో జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు ఏలూరు జడ్పీకి వెళ్లాల్సి వస్తోంది. కలెక్టరేట్‌కు బస్ సౌకర్యం అందుబాటులో లేదు. వచ్చే ఏప్రిల్ నాటికి కొత్త జిల్లాలు ఏర్పడి నాలుగేళ్లు పూర్త వుతుంది. అప్పట్లో వైసీపీ చేసిన నిర్వాకం ఇంకా వెంటా డుతూనే ఉంది. తెలుగు దేశం కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీ కరణ చేపట్టడంతో తూర్పుగోదావరి జిల్లా సరిహద్దులు మారుతు న్నాయి.ఈ నెలాఖరుకి మండపేట నియోజక వర్గం పరిధిలోని మూడు మండలాలు కలవ నుండడంతో జిల్లా హద్దులు మారనున్నాయి.



చుట్టూ ఇంతే : కలెక్టరేట్ ప్రాంగణంలో గడ్డి



పట్టుకుంటే షాక్ : కలెక్టరేట్ ప్రాంగణంలో ఆరుబయట మీటర్



కలెక్టరేట్ భవనంపైకి ఎక్కేస్తున్న పాదులు



ఎలా వెళ్లేది : ఇరుకు సందులో పీజీఆర్ఎస్ అర్జీదారుల క్యూ

కలెక్టరేట్‌కెళితే.. కర్రతీసుకెళ్లండి!

జిల్లా అంతటికీ దిశానిర్దేశం చేసే కలెక్టరేట్ ప్రాంగణం ఇది.. ఇక్కడేం చెబితే జిల్లా అంతటా అదే జరుగుతుంది.. అంటే ఆ కార్యాలయం ఎంత మోడల్‌గా ఉండాలి.. కానీ చుట్టూ తుప్పలతో నిండి అధ్వానంగా ఉంది.ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌కు వెళితే కర్ర తీసుకుని వెళ్లాల్సిందే.. ఎందుకంటే ఎటు నుంచి పాము వస్తుందో.. ఏమి వస్తుందో తెలియని పరిస్థితి..

విలపింఛన్!

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో..



ఈమె గత బుధవారం ఒడిలో ఉన్న కుమార్తె పింఛను నిమిత్తం అడిగేందుకు నల్లజర్లలో జరిగిన సీఎం చంద్రబాబు సభకు వచ్చారు..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ రాయుడుపాకలకు చెందిన మాచవరపు రిత్విక గ్రేస్‌కు ఆరేళ్లు. దివ్యాంగురాలు.. రెండు కాళ్లు పనిచేయవు.. తరచూ ఫిట్స్ వస్తుంటాయి.. బ్రెయిన్ డ్యామేజీ ఉంది.. దీంతో సదరం సర్టిఫికెట్‌లో 100 శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి చిరు ప్రైవేట్ ఉద్యోగి.. గత నాలుగేళ్లుగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.. నేటికీ నమోదు కాలేదు. కూటమి ప్రభుత్వంలో తప్పనిసరిగా పింఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు.. ఈ ప్రభుత్వంలోనూ ఇదే పరిస్థితి. తమ కుమార్తెకు దివ్యాంగ పింఛన్ ఎప్పుడు మంజూరవుతుందో.. ఎప్పుడు తమ కష్టాలు తీరతాయోనని ఎదురుచూపులు చూస్తున్నారు...

కాకినాడకు చెందిన యాళ్ల లలితకు ప్రస్తుతం ఏడేళ్లు. మానసిక, శారీరక దివ్యాంగురాలు..సదరం సర్టిఫికెట్‌లో వంద శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి తాపీ పని చేస్తుంటాడు.. గత ఐదేళ్లుగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా డు.. నేటికీ నమోదు కాలేదు.కూటమి ప్రభుత్వంలోనైనా పింఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు..ఇప్పుడూ ఇదే పరిస్థితి.

కాకినాడలోని దుమ్ములపేటకు చెందిన కృష్ణవర్ధన్‌కు నాలుగేళ్లు. డ్రోన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం ఇచ్చారు..తండ్రి ఆటోడ్రైవర్. అంతంతమాత్రమే ఆదాయం. గత మూడేళ్లుగా పింఛన్‌కు దరఖాస్తు చేస్తూనే ఉన్నాడు.దరఖాస్తులకు వందల్లో ఖర్చవుతుంది కానీ నేటికీ ఫలితం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిస్థితిలో మార్పు లేదు. దీంతో లబోదిబోమంటున్నారు.

- నోటిఫికేషన్‌కు ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు
- 17 నెలలైనా స్పందన రాక లబోదిబో
- వెల్లువలా దరఖాస్తులు, వినతులు

సామర్లకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలైంది.. నేటికీ కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించడంలేదు. దీంతో వేలాది మంది లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచింది. కొందరికి ప్రత్యేకంగా రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుకు ఎక్కడ లేని డిమాండ్ వచ్చిప డింది. దీంతో దరఖాస్తుదారులు పెరిగారు. కూటమి ప్రభుత్వంలో వెంటనే దరఖాస్తులు స్వీకరిస్తుందని లబ్ధిదారులు అనుకున్నారు.కానీ అలా జరగలేదు. దీంతో ప్రభుత్వం నుంచి స్పంద నకు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 60 వేల మంది వరకూ కొత్త పింఛన్లకు అర్హులు ఉన్నట్టు సమాచారం.

ప్రస్తుత పింఛన్లు ఇవే..

జిల్లా	లబ్ధిదారులు	సొమ్ములు
కాకినాడ	2,71,360	117.81 కోట్లు
కోనసీమ	2,36,284	101.86 కోట్లు
తూర్పు	2,35,060	103.27 కోట్లు

పెండింగ్‌లో 30 వేల దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి సచి వాలయాల్లో నవంబరు 20 నాటికి సుమారు 30 వేల నూతనంగా పింఛన్లకు దరఖాస్తులు ఉన్నట్టు సమాచారం. వీటిలో కనీసం 24 వేల మందికైనా పింఛను అర్హత ఉంటుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 7,42,704 పింఛనుదారులకు ప్రతి నెలా రూ.322.94 కోట్ల మేర సొమ్ములను ప్రతి నెలా చెల్లిస్తున్నారు.ప్రభుత్వం ఇప్పటి వరకూ ఉన్న దరఖాస్తులకు మంజూరు లభిస్తే ప్రభుత్వానికి అదనంగా మరో రూ.12 కోట్ల మేర భారం కానున్నట్టు అంచనా.

నాడు అలా.. నేడు ఇలా..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరంగా జరిగేది. వారం వారం దరఖాస్తులను పరిశీలించి నెలాఖరుకు జాబితా సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధా నానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకోసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెరమీదకు తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొం దిస్తామని చెప్పింది.గడచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వంలో పాతపద్ధతిలో ప్రతీ నెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని భావించినా ఊసేలేదు.



మా వైపు చూడండి సార్ : పవన్‌కు దివ్యాంగుల షేక్ హ్యాండ్(ఫైల్)



పరీక్ష రాస్తున్న విద్యార్థులు, పరిశీలిస్తున్న ఆర్డీవో

ఉచిత శిక్షణకు పరీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఆదివారం నిర్వహించిన సివిల్స్ ఉచిత శిక్షణ స్ర్కీనింగ్ పరీక్షకు 126 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ స్ర్కీనింగ్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ప్రతిభ ఆధారంగా సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎంపికైన వారికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. స్ర్కీనింగ్ పరీక్ష విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శశాంక తెలిపారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యువో కేఎన్ జ్యోతి, సహాయ బీసీ సంక్షేమ అధికారులు ముత్యాల సుబ్బారావు, టీవీ ప్రసాద్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఐడియా.. కౌవ్ కేక!

ఒక్క ఐడియా జీవితాన్నే మార్చేస్తోంది.. ఇదీ ఒక యాడ్.. ఈ చిత్రంలో చూడండి.. ఒక్క ఐడియా కౌవ్ కేకలా ఉంది కదా.. ఎందుకంటే రోడ్లపై సంచరించే ఆవుల కారణంగా జిల్లాలో అర్ధరాత్రి ప్రమాదాలు జరిగిన సంఘటనలు బోలెడు.. ఎవరైనా సరే ఆవులపై ఫిర్యాదు చేయడం వదిలేయడం చేసేవారు.. అయితే ధవళేశ్వరానికి చెందిన కొంత మంది మాత్రం చీకట్లో సైతం కనిపించేలా ఆవులకు ఇలా రేడియం బెల్టులు అమర్చుతున్నారు. ఇలా ప్రతి చోటా చేస్తే ప్రమాదాలకు చోటే ఉండవు కదా.. - ధవళేశ్వరం



వాట్ యాన్ ఐడియా : ధవళేశ్వరంలో గోవులకు అమర్చిన రేడియం బెల్ట్‌లు

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

బిక్కవోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీనియర్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర టీచర్స్ యూనియన్ ఆడిట్ మెంబర్ తమలంపూడి ఈశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బిక్కవోలులో శనివారం రాత్రి మండల ఎస్టీయూ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. ఈ సందర్భంగా ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే ఐఆర్ ప్రకటించి పీఆర్సీ కమిటీ వేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నిలిపివేయాలన్నారు.

అల్లుకున్న తీగ బంధం

- బాలాజీ మెయిన్ రోడ్డులో కరెంట్ స్తంభాన్ని పూర్తిగా కప్పేసిన పిచ్చిమొక్క
- తొలగించాలంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



నిడదవోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోను చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోతారు. ఎందుకంటే విద్యుత్ స్తంభాన్ని తీగ పెనవేసుకుంది. ఇది ఎక్కడో కాదండోయ్... నిడదవోలు పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి కూత వేటుదూరంలో ఉన్న బాలాజీ మెయిన్ రోడ్డులో దర్శనమిస్తోంది. తీగ మొత్తం పోల్‌ను అల్లుకుంది. కాగా, విద్యుత్‌శాఖ సిబ్బంది ఎక్కడైనా కరెంటు తీగలకు చిన్న కొమ్మలు తగిలితే వాటిని సైతం తొలగించేస్తుంటారు. అలాంటిది కరెంట్ పోలే కనిపించకుండా పిచ్చిమొక్కలతో కనిపిస్తున్నా... పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొన్నిసార్లు వర్షాలు కురిసే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిడదవోలులో విద్యుత్ స్తంభాన్ని పూర్తిగా కప్పేసిన పిచ్చిమొక్క

ఫైర్‌స్టేషన్‌కు కూలింగ్ వాటర్‌ఫిల్టర్ అందజేత



వాటర్‌ఫిల్టర్‌ను అందజేస్తున్న శివసాయిధామం సభ్యులు

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాయం చిన్నదే అయినప్పటికీ అందరికీ సాయపడాలనే దృక్పదంతో శివసాయిధామం సేవా సమితి పనిచేస్తుందని సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య అన్నారు. కొవ్వూరు ఫైర్‌స్టేషన్ సిబ్బంది అవసరార్థం ఆదివారం శివసాయిధామం సేవా సమితి సభ్యులు కూలింగ్ వాటర్‌ఫిల్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ వేణు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రెడ్డి తాతయ్యబాబు, పరిమి రాజేష్, నగళ్లపాటి శ్రీనివాస్, నారా సుబ్రహ్మణ్యేశ్వరరావు, గణేష్, ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన హనుమద్‌వ్రతాలు



అన్నదానం చేస్తున్న యువత

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో నిర్వహిస్తున్న హనుమద్ వ్రతాలు ఆదివారంతో ముగిశాయి. పట్టణంలోని గోదావరి ఏటిగట్టుపై భక్తాంజనేయ స్వామి స్నానఘట్టం వద్ద వేంచేసియున్న ఆంజనేయస్వామికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. హనుమద్‌వ్రతాలతు ముగింపు సందర్భంగా రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంగ్రోతు చిట్టిబాబు, బ్రహ్మజీ, కంచెన వీర్రాజు, పుప్పాల సురేష్, గంగ్రోతు స్వామి, రాయుడు, కృష్ణచైతన్య, మహేష్, సాయి, పాతపేట యూత్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆట 2.0లో చిన్నారుల ప్రతిభ



జీ తెలుగు ఆట కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన చిన్నారులు

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన జీ తెలుగు ఆట 2.0 ఆడిషన్స్‌లో కొవ్వూరు పట్టణానికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబర్చారు. జూనియర్స్ విభాగంలో కొవ్వూరు నటరాజ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు జి.వాసంతి, ఎం.జ్వాలామృత ప్రతిభ కనబర్చినట్టు డ్యాన్స్ టీచర్ ముత్యాల సాయికుమారి తెలిపారు. ఈ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది డ్యాన్సర్లు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆలయానికి గోదానం



కార్యక్రమంలో రామకృష్ణారావు కుటుంబ సభ్యులు, ఇస్కాన్ ప్రతినిధులు, భక్తులు

తాళ్లపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోవును దానం చేయడం వల్ల మనిషి జీవితానికి ఎంతో పుణ్య ఫలం లభిస్తుందని ఆదివారం ఇస్కాన్ ప్రతినిధి శ్యామాంగ ప్రభూజీ తెలిపారు. ప్రక్కిలంక గోదావరీ నదీ తీరం వద్ద గల ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన ప్రభుపాద భజన కుటీర్‌కు పంగిడి గ్రామానికి చెందిన ముసినే రామకృష్ణారావు కుటంబ సభ్యులు గోదానం చేసారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రతినిధి శ్యామాంగ శ్రీనివాస ప్రభూజీ పాల్గొని గోదానం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇస్కాన్ మందిరంలో భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణారావు కుటుంబ సభ్యులు, భక్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి



కోరుమామిడిలో కోడిపందేలు ఆడుతున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

నిడదవోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుమామిడిలో ఆదివారం కోడిపందేలు ఆడుతున్న సమాచారం మేరకు సమిశ్రగూడెం పోలీసులు దాడి చేసి ఐదుగుర్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.1070 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం : మంత్రి



నిడదవోలులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని, ఉన్నత శిఖరాలకు చేరుకోగలిగితే అదే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడద వోలు పట్టణంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కేవీపీఎస్ చర్చ్‌పేట యూత్ పెద్దల ఆధ్వర్యంలో నిడదవోలు చర్చ్ పేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు, న్యాయవాది జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. నిరంతరం నిడదవోలు పరిశుభ్రత కోసం పాటు పడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనిది అని, అంబేద్కర్ విగ్రహం ముందు వారిని సన్మానించడం తనకు సంతృప్తినిచ్చిందని మంత్రి దుర్గేష్ అన్నారు. కార్యక్రమంలో ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు, సీఐటీయు నాయకులు కామ్రేడ్ దిద్దే దయామణి, సీఐటీయూ నాయకులు కామ్రేడ్ గంటి కృష్ణ జీ డానియల్, జగ్జీవన్ రామ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బైపే రాజేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు పైడియ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టీ. చిరంజీవి, బి. నాగేశ్వరరావు, డి. సుబ్రహ్మణ్యం, పెయింటర్స్ యూనియన్ నాయకులు పి. చినబాబు, యు. ప్రభాకర్, టీ. ముత్యాల రావు, టీ. సుధాకర్, గండి శేఖర్ యూత్ నాయకులు టీ. నానీ, టీ నంగాల రాజు, లెనిన్, దాకే కృష్ణ,యు మోషే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



ఆలయ పాలకవర్గ సభ్యులతో మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కానూరు కొండాలమ్మ ఆలయ నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది భక్తులు వస్తుంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ చైర్మన్‌గా బొబ్బిలి దుర్గారావు, పాలక వర్గ సభ్యులుగా దుర్గాదేవి, ఆంజనేయులు, జె. శ్రీను, నాగ త్రివేణి, వి. సీతారామలక్ష్మి, భావన ధర్మ శేకర్, బీవీ రమణ ప్రమాణస్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



పశివేదలలో పప్పుధాన్యాల విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పప్పుధాన్యాల విత్తనశుద్ధిపై రైతులకు నైరా అగ్రికల్చరల్ కలాశాల విద్యార్థులు ఆదివారం అవగాహన కల్పించారు. పశివేదల నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు పప్పుధాన్యాల విత్తనశుద్ధిపై ప్రదర్శనలు నిర్వహించారు. రైతులకు విత్తనశుద్ధి అవసరమన్నారు. ఫ్సూడోమోనాస్ ఫోరెసెన్స్ వల్ల వచ్చే ప్రయోజనాలు, పంటల్లో వ్యాధి నిరోధకత పెరగడం, మొలకశాతం మెరుగుపడడం వంటి అంశాలను వివరించారు. పప్పుధాన్యాల విత్తనాలను జీవ నియంత్రణ ఏజెంటుతో శుద్ధి చేసే విధానాన్ని ప్రదర్శించారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థుల సేవలను రైతులు అభినందించారు.

సుందరేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు



స్వామికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గశిర ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో సుందరేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు, అన్నాభిషేకాలు నిర్వహించారు. అలాగే సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన భక్తాంజనేయ ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలు



మహాపూర్ణాహుతికి ద్రవ్యాలను తీసుకుని వస్తున్న హనుమత్ దీక్షాదారులు

తాళ్లపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంకలో వేంచేసియున్న శ్రీభక్తాంజనేయ స్వామి 24వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించిన సర్వ దేవతా పారమాత్మక హోమంతో ముగిశాయి. గతవారం రోజులుగా ఆలయ అర్చకులు పెద్దింటి శ్యామ్, పెద్దింటి భార్గవ్ నిర్వహిస్తున్న హోమాలు ఆదివారం మేళ తాళాలతో గోదావరి నదీ తీరంలో ఘనంగా శ్రీ చక్రస్నానం నిర్వహించారు. అనంతరం ఆలయంలో హనుమత్‌దీక్షాదారులు, గ్రామస్థులతో మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి ఆవుపాలు, పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సొలస గిరిధర్ గాంధీ, విశ్వనాథం, హనుమత్ దీక్షాదారులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ నూతన కార్యవర్గ సభ్యులు

తాళ్లపూడి, డిసెండరు 7 (ఆంధ్రజ్యోతి): మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక ఆదివారం ప్రక్కిలంకలోని శివాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఇందులో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోబడిందని కమిటీ సభ్యుడు కడలి కిరణ్ కుమార్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా పట్నాల సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా పట్నాల సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా కడలి కిరణ్ కుమార్, కోశాధికారిగా ముత్తేజు మరళీ ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- పార్టీ సీనియర్ నేత • ఎమ్మెల్సీ సోమువీర్రాజు



వెదుళ్లకుంటలో బొడ్డు వీరరాఘవులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

గోపాలపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. వెదుళ్లకుంటకి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వీరరాఘవులు తండ్రి ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మండల పార్టీ సమా వేశంలో కార్యకర్తలనుద్ధేశించి మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అటు దేశం ఇటు రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతోందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి శరవేగంగా దూసుకెళ్తోందని ప్రధాని ఏనాడో చెప్పారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, టీడీపీ నాయకులు ఇల్లూరి పెంటర్రాజు, పెనుమత్స రంగరాజు, గెల్లా శ్రీనుబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు పిల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకులు కొండేపాటి రత్నాజీ చౌదరి, గద్దే వీరరాఘవులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో 16 నుంచి ధనుర్మాసోత్సవాలు



దేవరపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చేనెల 13 వరకు ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు ఆలయంలో ఉత్తర ద్వారదర్శనం, ఏడు గంటలకు స్వామివారి తిరుత్సోవం ఉంటుందన్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 4.30 నిమిషాల నుంచి స్వామివారి ప్రతహకాల అర్చన, 5.30 గంటలకు తిరుప్పావై సేవ, పంచహా రతులు, మంగళ శాసనం, 13న గోదారంగనాథుల కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

'ఏసుక్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకం'



జగన్నాథపురంలో మొంథా తుపాన్ బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోపాలపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవార్ని ఆదుకోవాలన్న ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి స్ఫూర్తిదాయకమని జగన్నాథపురం క్రైస్ట్ ఇవాంజలికల్ లూథరన్ మినిస్ట్రీ దైవజనులు ననమండ్ర జాన్‌బాబు అన్నారు. జగన్నాథపురం క్రైస్ట్ ఇవాంజలికల్ లూథరన్ మినిస్ట్రీస్ చర్చ్ వద్ద ఆదివారం మొంథా తుపాన్ బాధితులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ముప్పైమూడున్నర ఏళ్ల జీవితంలో వారు బోధించిన ప్రతి మాటను ఇతరులకు ఆచరించి చూపిస్తూ మార్గదర్శకం అందించారన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సచ్చితానంద, కొడూరి రఘురామ్, గమిడి రాఘవయ్య, పసుమర్తి గంగాధర్, పసుమర్తి పెద్దబ్బులు, మండల తెలుగు యువత అధ్యక్షుడు పసుమర్తి రాఘవచౌదరి, జనసేన మండల ఉపాధ్యక్షుడు పోసిన గణపతి, యూత్ కమిటీ సభ్యులు చిన్నారావు, ఇస్సాకు, కాట్రగడ్డ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

దుద్దుకూరులో కోటి సంతకాల సేకరణ



దుద్దుకూరులో సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నేత సతీష్

దేవరపల్లి, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): దుద్దుకూరులో వైసీపీ ఆధ్వ ర్యంలో ఆదివారం కోటి సంతకాలు సేకరించినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో పీపీ విధానం కూటమి ప్రభుత్వం చేస్తుందని, దీన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో దుద్దుకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపోలు కృష్ణారావు, మాజీ సర్పంచ్ దోనెల్లి జానకీరామ్, ఎంపీటీసీ కరుటూరి నిత్యానందం, స్థానికులు నిమ్మగడ్డ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీలో మొట్టమొదటిసారిగా జనవరి 4వ తేదీన సీఐటీయూ 18వ జాతీయ మహాసభలను విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు 5 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నో ప్లాస్టిక్ నినాదంతో మహసభలు జరుగుతాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థల రక్షణ, అసంఘటితరంగ కార్మికుల భద్రత సామాజిక భద్రత, స్కీం వర్కర్లుకు కనీస వేతనం రూ. 26వేలు అందించాలని, ప్రజల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్‌లను తిప్పికొట్టడం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యోగభద్రత, సామాజిక న్యాయం, మహిళల పని భద్రత అంశాలపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలపై చర్చించి, రైతులు, కార్మికులను, ప్రజలను సమీకరించి దేశవ్యాప్త ఐక్య పోరాటాల రూపకల్పన చేయనున్నామన్నారు. జిల్లాలో కార్మిక కుటుంబాలను నేరుగా కలిసి మహసభల ప్రాముఖ్యతను తెలియజేస్తామన్నారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో జరిగే బహిరంగ సభకు జిల్లా నుంచి యావత్ కార్మికవర్గం తరలిరావాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, సీఐటీయూ కొవ్వూరు కన్వీనర్ బీరా రవి, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీతో ప్రమాణం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు జయకర్, పక్కన తదితరులు

నల్లజర్ల, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): యూటీఎఫ్ మండల నూత న కమిటీని ఆదివారం నల్లజర్ల హైస్కూల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పి. జయకర్ పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ సెలవు దినా ల్లో అమలుపరచడం సరైనది కాదన్నారు. ఉపా ధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాల న్నారు. నల్లజర్ల యూటీఎఫ్ మండలాధ్యక్షు లుగా బండి కిషోర్, గౌరవ అధ్యక్షులు ప్రత్తి పాటి వీర్రాజు,కార్యదర్శి షేక్‌ఫక్రుద్దీన్ ఆలీ ఆహ్మద్, అసోషియేట్ అధ్యక్షులు లింగంకుంట్ల నాగరాజు, మహిళా అధ్యక్షురాలు కలపాల కృష్ణవేణి, కోశాధికారి తాడిగడప నాగేశ్వరరావు, మరో 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీరి చేత జిల్లా అధ్యక్షులు జయకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్‌కుమార్, ఎన్. భవానీ, పల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంతీదేవి ఉత్సవాలు



గోపాలపురంలో కుంతీదేవి ఉత్సవాలు

గోపాలపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దగూడెంలో ఆదివారం కుంతీదేవి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నందీశ్వరుడు, కుంతీదేవి అమ్మవార్లను బాణ సంచా, తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషధారణలతో అంగరంగ వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నెల్సన్ ఆంటోనికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ లీడర్‌షిప్‌లో కొవ్వూరు పట్టణానికి చెందిన హోలీ ఏంజిల్ పాఠశాల కరస్పాండెంట్ వలీయవీడు నెల్సన్ ఆంటోనీని యుఎస్ఏ, కాలిఫోర్నియాకు చెందిన అమెరికన్ మేనేజ్‌మెంట్ యూనివర్శిటీ డాక్టరేట్‌తో సత్కరించింది. దీనిలో భాగంగా ఢిల్లీ, గురుగ్రామ్‌లోని వెల్‌కమ్ ఐటీసీ హోటల్‌లో ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆంటోనీని అమెరికన్ మేనేజ్‌మెంట్ యూనివర్శిటీ చైర్మన్ రాయ్ వర్గిన్ సత్కరించారు.

అనంతపల్లి మాజీ సర్పంచ్ మృతి

నల్లజర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లి మాజీ సర్పంచ్ గద్దే చిన నరసింహారావు (77) ఆదివారం తెల్లవారు ఝామున మృతిచెందాడు. 1980 నుంచి 86 వరకు ఆయన సర్పంచ్‌గా వ్యవహరిస్తూ గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈయన కుమారులు, కుమార్తె అమెరికా నుంచి రావాల్సి ఉన్న కారణంగా అంత్యక్రియలు 9వ తేదీన రాజమహేంద్రవరం హిందూ శ్మశాన వాటికలో జరుగుతాయని సమీప బంధువులు తెలిపారు. ఆయన పార్థివదేహానికి మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, గన్నమనేని కృష్ణ మోహన్, దాసు రాజా, వల్లిరెడ్డి సతీష్, టీడీపీ అధ్యక్షులు విప్పిలి శ్రీనివాస్, బోయపాటి రమేష్, సుబ్బారావు, కెంగం శ్రీను, మద్దిపాటి నరసింహారావు, గెడ్డపు సూర్యనారాయణ, తదితరులు నివాళి అర్పించారు.